
నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 21 అక్టోబర్ 2024 | KAMAREDDY



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# 'భరోసా' దాటవేతపై భగ్గుమన్న బీఆర్ఎస్

## ఉమ్మడి జిల్లాలో హోరెత్తిన నిరసనలు


- మండల కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు
- పాల్గొన్న పార్టీ శ్రేణులు, అభిమానులు, రైతులు
- సీఎం రేవంత్, మంత్రి తుమ్మల దిష్టిబొమ్మల దహనం
- రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని డిమాండ్

**వానకాలానికి సంబంధించి** రైతుభరోసా ఇవ్వలేమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. జిల్లా కేంద్రాలతోపాటు ప్రతి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పెద్దసంఖ్యలో రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. మాక్లూర్ మండలం మానిక్‌బండార్‌లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, తాడ్వాయిలో చేపట్టిన ధర్నాలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రైతుభరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలు కోతకు వచ్చినా .. రైతు భరోసా ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలతో పాటు రైతుబంధు, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాగిరెడ్డిపేటలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకొన్నారు. రోడ్డుపై నుంచి వారిని బలవంతంగా పక్కకు పంపించారు. దీంతో వారు ర్యాలీగా వెళ్లి స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతు నిరసన దీక్ష చేపట్టారు.

– నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 20



బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకుల నిరసన దీక్ష



నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## రైతు పాలిట రేవంత్ శాపంలా మారాడు

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**

ఖలీల్‌వాడి, అక్టోబర్ 20 : సీఎం రేవంత్‌రెడ్డి రైతు పాలిట శాపంలా మారాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. రైతుల నోటికాడ బుక్క లాక్కున్న రేవంత్‌కు పుట్టగతులు ఉండవన్నారు. రేవంత్ గుంపు మేస్త్రీతోపాటు గప్పాల మేస్త్రీ అయ్యాడని విమర్శించారు. మోసాల్లో మోనార్క్‌గా తయారయ్యాడన్నారు. రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వడాన్ని కేసీఆర్ కనీస ధర్మంగా పాటించారని తెలిపారు. రూ. 80 వేల కోట్ల అప్పు తెచ్చిన రేవంత్.. రైతులకు ఏడు వేల కోట్ల పెట్టుబడి సాయం ఇవ్వలేవా ? అని ప్రశ్నించారు. మూసీ తప్ప ఈ సీఎంకు వేరే పని లేదని, కమీషన్లు రావనే రైతు బంధు ఆపారని అన్నారు. మాట తప్పిన రేవంత్‌ను మడత బెట్టాల్సిన అవసరం వచ్చిందన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తానని బొంకి, ఇప్పుడు సన్న వడ్లకే అంటున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. మక్కలకు బోనస్ ఇస్తానని, దానిని కూడా ఎగ్గొటాడన్నారు. ఇక రైతు రణం చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఓట్లున్నప్పుడే రైతులు గుర్తుకొస్తారని, ఇక రేవంత్‌కు కౌంట్ డౌన్ మొదలైందన్నారు. రైతులతో పెట్టుకున్నోడు ఎవడైనా మట్టి కరవాల్సిందే అన్నారు. ఢిల్లీకి ట్రిప్పులు.. ప్రజలకు తిప్పలు ఇదే రేవంత్ సాధించిన ఘనత అని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. రేవంత్ సర్కార్‌కు రానున్న రోజుల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సత్యప్రకాశ్, రవి, సిర్ప రాజు, అభిలాష్‌రెడ్డి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, పక్కన జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్

**-మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్**

లింగంపేట(తాడ్వాయి), అక్టోబర్ 20: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు వానకాలం పంట పెట్టుబడి సాయం అందకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఏ కష్టం రాకుండా చూసుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ సర్కార్ రైతుబంధు పథకాన్ని నీరుగార్చడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. రైతుభరోసాపై సబ్ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నదన్నారు. కేసీఆర్ హయాంలో ఎలాంటి కమిటీలు లేకుండా రైతుబంధు డబ్బులు అందించినట్లు తెలిపారు. రైతులు కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టుకుపోతుందన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం ముందుకు పడ్డ దాఖలాలు లేవన్నారు. రైతులతో పెట్టుకున్న ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగలా మార్చిందని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ వ్యవసాయాన్ని దండగగా మారుస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11తనెలల కాలంలో అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీకి సాయం చేస్తున్నారని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన దాఖలాలు లేవన్నారు. రైతుభరోసా వచ్చే వరకూ రైతుల పక్షాన పోరాటం చేస్తామని జాజాల స్పష్టం చేశారు.



తాడ్వాయిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల



మాక్లూర్ మండలం మానిక్‌బండార్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు




లింగంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## ఎస్సారెస్పీ 12 గేట్ల ఎత్తివేత

మోర్తాడ్, అక్టోబర్ 20: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఆదివారం వరద ఉధృతి పెరిగింది. దీంతో అధికారులు 12 గేట్లు ఎత్తి మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఆదివారం ప్రాజెక్ట్‌లోకి 46,942 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు)కాగా, ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 1091అడుగుల (80.501టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 12 గేట్లు ఎత్తి 37,488 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాకతీయ కాలువకు 5800, ఎస్కేప్‌గేట్ల ద్వారా 2200, లక్ష్మీకాలువకు 150, వరదకాలువకు ఐదు వేలు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

## కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యం

- ఎమ్మెల్యేను బిల్లులు అడగడానికి వెళ్లిన మాజీ ఉప సర్పంచ్‌ను తోసేసిన వైనం
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 20 : పాఠశాలలో తన సొంత డబ్బులతో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని ఎమ్మెల్యేను అడగడానికి వెళ్లిన మాజీ సర్పంచ్‌పై కాంగ్రెస్ నాయకులు దౌర్జాన్యానికి పాల్పడ్డారు. ఈ విషయమై తోపులాట చోటుచేసుకోగా.. సదరు మాజీ సర్పంచ్‌ను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. సికింద్రాపూర్‌లో అర్గుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వచ్చారు. అదే గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో అభివృద్ధి పనులకు రూ.7లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులు త్వరగా రాకపోవడంతో పనులు నిలిచిపోవద్దనే ఉద్దేశంతో గ్రామ మాజీ ఉపసర్పంచ్ అప్పాల అరుణ్‌కుమార్ ముందుకొచ్చి తన సొంత డబ్బులు రూ.60వేలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పీఏ శ్రీనివాసరెడ్డి ..అరుణ్‌కు ఫోన్ చేసి 'నీవు ఎందుకు పనులు చేయిస్తున్నావు.. మా పార్టీ వారు చేయిస్తారు.. నీవు పనులు ఆపేయ్' అని చెప్పారు. దీంతో అరుణ్ పనులు నిలిపివేశారు. ఆదివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పాఠశాలలో అభివృద్ధి పనులకు రూ.60 ఖర్చు పెట్టానని, బిల్లులు ఇప్పించాలని వెళ్లగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ, ఆయన సోదరుడు కలిసి అరుణ్‌ను అడ్డుకొని తోసేశారు. దీంతో ఎమ్మెల్యే ఎదుట తోపులాట జరిగింది. వెంటనే అక్కడున్న పోలీసులు అరుణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పని చేసిన కష్టానికి డబ్బులు అడిగితే కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం ఎంతవరకు సమంజసమో ఎమ్మెల్యే చెప్పాలని అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, పాఠశాల అభివృద్ధికి తాను వెచ్చించిన డబ్బులు ఇవ్వాలని కోరారు.

## గ్యాంగ్ రేప్ కేసులో నలుగురి అరెస్టు

**రిమాండ్‌కు తరలింపు**

వినాయక్‌నగర్, అక్టోబర్ 20 : జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం నుంచి ఓ మహిళను ఆటోరిక్షాలో తీసుకెళ్లి గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరానికి వచ్చిన ఓ మహిళ శుక్రవారం రాత్రి బస్టాండ్ వద్ద ఒంటరిగా ఉండడంతో ఓ ఆటోవాలా ఆమెను ఆటోలో ఎక్కించుకొని, డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ ప్రాంతానికి తీసుకువెళ్లి మరో ముగ్గురితో కలిసి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఘటనాస్థలానికి చేరుకొని అక్కడ ఆధారాలు సేకరించారు. నిందితులు డిచ్‌పల్లి ప్రాంతానికి చెందిన మోసిన్, జైనుద్దీన్, సుల్తాన్, నాగేశ్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, ఆటోరిక్షాతో పాటు బాధితురాలిని తిరిగి నిజామాబాద్‌లో డ్రాప్ చేసేందుకు వినియోగించిన బైక్‌ను సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

## ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

**తడిసిన ధాన్యం.. ఆందోళనలో రైతాంగం**

నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 20: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు మండలాల్లో పంటలు దెబ్బతినగా.. ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం నల్లమడుగు, బాణాపూర్, కోర్పోల్, బాయంపల్లి, లింగంపల్లి, ఐలాపూర్, మెంగారం, శెట్పల్లి తదితర గ్రామాల్లో ఆదివారం కురిసిన వర్షానికి కోత దశకు చేరిన వరి పంట నేలవాలినట్లు రైతులు తెలిపారు. లింగంపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయకపోవడంతో అంధకారం నెలకొన్నది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, రుద్రూర్, కోటగిరి, నవీపేట, రెంజల్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. సాలూరా మండలంలోని హున్సా, ఫత్తేపూర్, ఖాజాపూర్ గ్రామాల్లో వరి, సోయాబీన్ కుప్పలు తడిసి ముద్దయ్యాయి. భీమ్‌గల్ కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం కుప్పల్లోకి వర్షపునీరు చేరింది. రెంజల్ మండలంలోని కందకుర్తి, బోర్గాం, నీలా, తాడ్‌బిలోలి గ్రామాల్లో రైతులు సాగు చేసి చేతికొచ్చిన సోయా పంట తడిసిపోయింది. ఉమ్మడి కోటగిరి మండలంలో రైతులు ఆరబెట్టిన ధాన్యంలోకి వర్షపు నీరు చేరింది. నవీపేట మండలంలోని రాంపూర్, రెడ్డిఫారం మోకన్‌పల్లి, నాళేశ్వర్ తదితర గ్రామాల్లో చేతికి వచ్చిన ధాన్యం తడిసి పోయింది. తడిసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కందకుర్తి శివారులో తడిసిన సోయాను ఆరబెడుతున్న రైతు



కోటగిరిలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు